## క్లుప్తంగా

### నేను బడికి పోతా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం బ్రహ్మయ్య

**ఒంగోలు రూరల్:** త్రోవగుంట హైస్కూల్లో శనివారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య రిబ్బన్ కట్ చేసి ర్యాలీని ప్రారంభించగా, తెలుగు యువత నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌ఎం బ్రహ్మయ్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి భవిష్యత్తుకు పునాది వేసేందుకు పాఠశాలలో నూరుశాతం అడ్మిషన్లు లక్ష్యంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పని చేయాలని కోరారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు.

### లాసెట్‌లో రాణించిన శ్రీ ప్రతిభ విద్యార్థులు



వర్రా ప్రియ



నలగట్ల కవిత



మారంరెడ్డి వైష్ణవి

**ఒంగోలు టౌన్:** ఏపీ లాసెట్ 2024లో ఒంగోలు శ్రీ ప్రతిభ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని ఆ సంస్థ చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల లా కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్‌లో వర్రా ప్రియ 725, నలగట్ల కవిత 1,658, మారంరెడ్డి వైష్ణవి 2,239 రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. అద్భుతమైన ప్రతిభతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాష్ నారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

### పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాలి

**పుల్లలచెరువు:** పింఛన్ల పంపిణీ సక్రమంగా చేయాలని ఎంపీడీవో విలియమ్స్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని 19 సచివాలయాల పరిధిలో 7,963 మందికి సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ చేయనున్నామని, పింఛన్ల పంపిణీని పారదర్శకంగా చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను అనుసరించి సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాలన్నారు. ఈ విషయంలో సిబ్బంది ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తీసుకుంటామని, తప్పని సరిగా 1వ తేదీనే పూర్తి చేయాలని, మిగిలిన వారుంటే రెండో రోజు ఇచ్చేందుకు అధికారుల అనుమతి తీసుకుని పంపిణీ చేయాలన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**కురిచేడు:** మండల సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలోని సమావేశపు హాలులో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతారామయ్య తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

### సనాతన ధర్మాన్ని కాపాడండి

**మార్కాపురం రూరల్:** సనాతన ధర్మాన్ని కాపాడాలని ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాతీయ ప్రచార చీఫ్ ఆఫ్ చాంపియన్ శివసేవక్ శివశివకరుణ పాదయాత్ర శనివారం రాయవరం గ్రామానికి చేరుకుంది. ఈయనకు రాయవరం గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. శివశికరుణ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా రాయవరంలోని నిర్మమహేశ్వర వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మరక్షణ కోసం అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ పాదయాత్ర చేస్తున్నానన్నారు. భారత దేశ రక్షణలో అమరులైన వీరుల గాథలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సనాతన ధర్మాన్ని పాటించాలి కోరారు. గాయం దశరథ రామిరెడ్డి, దేవండ్ల ఏడుకొండలు, వేముల క్రిష్ణారావు, తమ్మిశెట్టి పుండరీ, వెంకట రామయ్య, ఏడుకొండలు, శ్రీను, వెంకటేశ్వర్లు,పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీని ఉదయాన్నే ప్రారంభించాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు



సమీక్షిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు

**ఒంగోలు:** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పంపిణీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తన చాంబరులో పెన్షన్ల పంపిణీపై మేనేజర్, సీ3 క్లర్కు, ఈ3 క్లర్కు, జీ3 క్లర్కులతో సమావేశం నిర్వహించారు. పెన్షన్ నగదును బ్యాంకు నుంచి డ్రా చేయడంతో పాటు పెన్షన్లు పంపిణీ చేసేందుకు కావాల్సిన పరికరాలను సమకూర్చాలని ఆదేశించారు. పెంపుదల చేసిన పెన్షన్లు అరియర్స్‌తో కలిపి రూ.7 వేలు, దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారికి రూ.10 వేలు, పక్షవాతం వల్ల కుర్చీ, మంచానికే పరిమితమైన వ్యక్తులు, తీవ్రమైన మస్కులర్ డిస్ట్రోఫీ కేసులు, ప్రమాద బాధితులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచిన పెన్షన్ల నగదు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పెంచిన పెన్షన్ల నగదును 425 మంది సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ కార్యాలయ సిబ్బంది ద్వారా జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలన్నారు పెన్షన్‌దారులు జూలై 1వ తేదీ ఇంటి వద్దనే అందుబాటులో ఉండాలన్నారు. ఏ ఒక్క పెన్షన్‌దారుడు కూడా పెన్షన్ గురించి సంబంధిత సచివాలయాల వద్దకుగానీ, నగరపాలక సంస్థ కార్యాలయానికిగానీ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఇతర ప్రదేశాలకు వెళ్లిన పెన్షన్‌దారులు కూడా జూలై 1న పెన్షన్ తీసుకునేందుకు అందుబాటులో ఉండాలన్నారు. పెన్షన్ పంపిణీ చేసే సిబ్బంది పెన్షన్ రసీదుతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి వారి లేఖను పింఛనుదారులకు అందించడం జరుగుతుందన్నారు. పెన్షన్ నగదును వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు డ్రా చేసి పంపిణీ చేసేందుకు కావాల్సిన పరికరాలన్నీ సిద్ధం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. పెన్షన్ నగదు బ్యాంకు నుంచి డ్రా చేయడం, పంపిణీ చేసే సిబ్బందిని పర్యవేక్షించేందుకు 5 సచివాలయాలకు ఒక పర్యవేక్షణాధికారిని నియమించినట్లు తెలిపారు.

**సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీ**

**చీమకుర్తి:** ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ద్వారా నిర్వహించనున్నట్లు చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ ఈశ్వరరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లతో సంబంధం లేకుండా సచివాలయాల్లో పనిచేసే సిబ్బందిని క్లస్టర్ల వారీగా విభజించి ఒక్కొక్కరికి 50 మంది పింఛను లబ్ధిదారులను కేటాయిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మొదటి రోజే నూరు శాతం పింఛన్ల డబ్బు పంపిణీ చేయాలని ఆదేశించారు.

# వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం





దేవతల వేషధారణలో ప్రదర్శనలిస్తున్న చిన్నారులు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**ఒంగోలు మెట్రో:** స్థానిక శివప్రసాద్‌కాలనీలోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం ఎనిమిది గంటలకు పోలేరమ్మ మూలవిరాట్‌కు పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, సుగంధ ద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, చక్కెర, పండ్ల రసాలతో శ్రీ సూక్తంతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని చక్కని వస్త్రాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అష్టోత్తర శతనామావళి పూజ క్రతువులు నిర్వహించి మంగళ హారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఎనిమిది గంటలకు లలిత అకాడమీ వారిచే చిన్నారుల దేవీ దేవతల వేషంలో చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# దాతల సహకారంతో దేవాలయం అభివృద్ధి



ఆశ్రమంలోని ఆంజనేయస్వామి విగ్రహం



బ్రహ్మంగారి విగ్రహం

**దొనకొండ:** స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆనంద ఆశ్రమంలో వెలసిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, శివ పార్వతులు, అభయాంజనేయ, సిద్ధమూర్తి, నందీశ్వర, కాశీనాయన ఆలయాలు దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతోంది. దాతలు ముందుకు వచ్చి తాము ఇష్టమొచ్చినట్లు విరాళాలు అందించి దేవాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నారు. నారసింహానాయునిపల్లెకు చెందిన బ్రహ్మంగారి పరమ భక్తుడు కాకర్ల భైరవానంద స్వామి దేవాలయాలు అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో దాతల సహకారం కోరి 2010లో దేవాలయాలకు శంకుస్థాపన చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు దాతలు ముందకు వస్తూ అభివృద్ధి చేపట్టారు. 2015లో బ్రహ్మంగారు ఆంజనేయస్వామి ఆలయాలు నిర్మించి ప్రతిష్టా కార్యక్రమం ఆర్భాటంగా నిర్వహించారు. ఏటా అయ్యప్ప భక్తులు వందల సంఖ్యలో పూజలు చేస్తూ అన్నదానం ఆలయాల అభివృద్ధికి తమ వంతు దాతృత్వంతో ముందుకు వచ్చి శివాలయం గోపురం వరకు నిర్మించారు. 33 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రోజూ భక్తులు శాంతి పూజలు, నవగ్రహా పూజలు నిర్వహిస్తూ వచ్చిన విరాళాలతో కాశి నాయన, నందీశ్వరుడు, ధ్యాన మందిరం ఏర్పాటు చేశారు. ధ్యాన మందిరంలో భక్తులు ఏకాగ్రతతో పూజలు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. నవగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆనంద ఆశ్రమంలో గో సంరక్షణ చేపడితే ఆశ్రమంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు పాడి పంటలు సస్యశామలంతో ఉంటాయని ప్రగాఢ నమ్మకంతో దాతల సహకరం గోశాల ఏర్పాటు చేశారు.

> **దాతలు సహకరించాలి:**
>
> 
>
> నిర్మాణంలో ఉన్న ఆలయం, మరికొన్ని గోపురాల ఏర్పాటుకు దాతలు సహకరించాలి. ఇప్పటికే దాతల సహకారంతో దేవాలయాలు ఏర్పాటు చేశాం. ఆలయంలో నిత్యం భక్తులకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అయ్యప్ప, బ్రహ్మంగారి భక్తులకు మాలలు ధరించు సమయంలో అన్నదానం నిర్వహిస్తున్నాం.
>
> కాకర్ల భైరవానందస్వామి

### పొక్లెయిన్ స్వాధీనం

**ముండ్లమూరు:** మండలంలోని పెద్ద ఉల్లగల్లు గ్రామం చెరువు నుంచి అక్రమంగా మట్టి తోడి టిప్పర్‌లకు ఎత్తుతున్న పొక్లెయిన్‌ను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి పూట దొంగతనంగా అక్రమమార్గంలో చెరువు మట్టిని తరలిస్తుండటంతో పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. మట్టి ఎత్తుకున్న టిప్పర్‌లు మాత్రం వేగంగా తరలి వెళ్లి పోవడంతో వాటిని పట్టుకోలేక పోయినట్లు సమాచారం.

### పిల్లలు పనిలో కాదు.. బడిలో ఉండాలి

**మార్కాపురం రూరల్:** పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలని రాయవరం జనరల్ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ఖలీమాభాను అన్నారు. శనివారం ఉదయం రాయవరంలో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ సిబ్బంది గ్రామస్తులతో కలిసి నేను బడికి పోతా.. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీమాభాను మాట్లాడుతూ విద్యార్థులంతా పనులకు కాకుండా బడులకు వచ్చేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. బడికి వచ్చినట్లయితే పిల్లల భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని ఆమె తెలిపారు. ఉపాధ్యాయులు వినుకొండ రాజేష్, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

**పొదిలి:** పట్టణంలోని ఓబులశెట్టివారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సీడీపీఓ సుధమారుతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రాల్లో ఆరు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపించే ప్రక్రియలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిల్లల తల్లులను, పాఠశాల టీచర్లను గౌరవించటం, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. సూపర్‌వైజర్‌లు సావిత్రి, ఝాన్సీ, కార్యకర్తలు అరుణ, పద్మ పాల్గొన్నారు.

### బెస్ట్ స్టూడెంట్‌కు నగదు అందజేత

**దర్శి:** మండలంలోని బండి వెలిగండ్ల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు జీపీఐ బెస్ట్ స్టూడెంట్ కింద రూ.500 ఉపాధ్యాయులు అందజేశారు. 200 మంది విద్యార్థుల్లో ఐదుగురిని బెస్ట్ స్టూడెంట్‌గా ఉపాధ్యాయులు ఎంపిక చేశారు.

### ముండ్లపాడులో నీటి కోసం ఇబ్బందులు

**గిద్దలూరు రూరల్:** మండలంలోని ముండ్లపాడు శివాలయం వీధిలో స్థానిక ప్రజలు నీటి కోసం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో శివాలయం వెనుక బోరు నుంచి వచ్చే నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుకు ఎక్కించేవారు. ప్రస్తుతం నీటి నిల్వలు తగ్గిపోవడంతో ట్యాంకుకు ఎక్కడం లేదు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. శివాలయం ముందు భాగంలో ఉన్న మరో బోరు నుంచి చిన్న ట్యాంకుకు ద్వారా నీటిని వంతుల వారీగా పట్టుకుంటున్నారు. ట్యాంకు వద్ద నీటిని పొందాలంటే బిందెలు ఒక్క రోజు ముందు పెట్టి వేచి ఉంటేనే నీటిని పొందే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. వెనుకాల ఉన్న బోరు నుంచి వచ్చే అరకొర నీటిని శివాలయం ముందు భాగంలోని ట్యాంకుకు ఎక్కించాలని స్థానికులు కోరుతున్నారు. ట్యాంకర్ల ద్వారా అయినా సరే నీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్త చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



**వరల్డ్‌కప్ మనదే..!**

టీ 20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఇండియా విజేతగా నిలిచింది. దీంతో ఒంగోలు నగరంలో క్రీడాభిమానులు కేరింతలు కొట్టారు. చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌ను క్రీడాభిమానులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఉత్కంఠ మ్యాచ్‌లో ఇండియా విజయం సాధించగానే కుర్రకారు రోడ్లపైకి వచ్చి సందడి చేశారు.

– సాక్షి, ఒంగోలు

# డాక్టర్ కాలేషా సేవలు రైతులు మరవలేరు



డాక్టర్ కాలేషాను సన్మానిస్తున్న పశుసంవర్థకశాఖ అధికారులు, సిబ్బంది

**ఒంగోలు టౌన్:** జిల్లాలో 37 ఏళ్లపాటు సుదీర్ఘంగా పశువైద్యుడిగా విధులు నిర్వర్తించిన పశుసంవర్థక శాఖ డీఎల్‌డీఏ డాక్టర్ కాలేషా సేవలను గ్రామీణ ప్రాంత రైతాంగం ఎన్నటికీ మరవలేరని పశుసంవర్థకశాఖ అడిషనల్ డైరక్టర్ డాక్టర్ వెంకట్రావు అన్నారు. విధి నిర్వహణలో నిజాయితీగా నిబద్ధతతో వ్యవహరించిన కాలేషా.. విశ్రాంత జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఒంగోలు, దర్శి, పామూరు, కందుకూరుల్లో ఎస్‌ఎల్‌బీపీ, ఉప సంచాలకులు, సంయుక్త సంచాలకులు, కార్యనిర్వహణాధికారి, డీఎల్‌డీఏగా వివిధ హోదాల్లో పనిచేసి ఇక్కడే రిటైర్ కావడం అరుదైన విషయమన్నారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కె.శ్రీనివాసరావు, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రజనీకుమారి, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి, బాపట్ల పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ హనుమంతరావు ప్రసంగించగా, ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకరామిరెడ్డి, సుధీర్, బసవ శంకరరావు పాల్గొన్నారు. అనంతరం కాలేషా దంపతులను ఘనంగా సన్మానించారు.

# ప్రభుత్వ అజమాయిషీ లేకనే ధరల పెంపు




ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

**ఒంగోలు టౌన్:** ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం వలనే కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. పెరిగిన ధరలు తగ్గించాలని కోరుతూ నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. టమోటా ధరతో సహా కూరగాయల ధరలన్నీ పేద ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయని, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతున్న ధరలు తగ్గించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. జీఎస్టీ తగ్గించి కందిపప్పు, వంట నూనెలు, బియ్యం ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు జి.ఆదిలక్ష్మి, గోవిందమ్మ, అమిరున్నిసా, తంబి శ్రీనివాసులు, ఎస్డీ హుసేన్, టి.మహేష్, ధారా వెంకటేశ్వర్లు, మారెళ్ల సుబ్బారావు, పోకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ చేసిన ఆఫీస్ సబార్డినేట్‌కు సన్మానం



సుభానీని సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

**ఒంగోలు అర్బన్:** స్థానిక జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (డీపీఆర్‌ఓ) కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన షేక్ మహబూబ్ సుభానీని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి గ్రేస్ లినోరా, ఇతర ఉద్యోగులు శనివారం ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రేస్ లినోరా మాట్లాడుతూ 35 సంవత్సరాలకుపైగా సమాచార శాఖలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందిన సుభానీ ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా గడపాలన్నారు. కార్యాలయంలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ రమేష్, డివిజనల్ పీఆర్‌ఓ దుర్గాప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బమ్మ, పబ్లిసిటీ అసిస్టెంట్ శ్రీనివాసరావు, టైపిస్ట్ ఇంది, ధనలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తాత్కాలిక సిబ్బంది నియామకానికి గ్రీన్ సిగ్నల్



అజెండాపై చర్చిస్తున్న చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి

**చీమకుర్తి:** చీమకుర్తి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు 37 మంది సిబ్బందిని నియమించేందుకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. శనివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించారు. వాటిలో ప్రధానమైన అంశాల్లో భాగంగా నగర పంచాయతీగా ఉన్న చీమకుర్తి గ్రేడ్–2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినందున పట్టణ విస్తీర్ణం కూడా పెరగడం, జగనన్న కాలనీలు ఏర్పడటంతో పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలనే ఉద్దేశంతో 25 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక్కొక్కరికి నెలకు రూ.12 వేల చొప్పున జీతాలు చెల్లించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. వారితో పాటు ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసేందుకు మరో 12 మందిని నియమించేందుకు ఆమోదం తెలిపారు. మిగిలిన అంశాలలో బోర్ల రిపేర్లు, ఆఫీస్‌లో మరమ్మతులు, కొండవీటి ఏడుకొండలు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకోవడానికి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ అందించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.